సాంబారుతోనే సరి

● పాఠశాలల్లో అస్తవ్యస్తంగా మధ్యాహ్న భోజనం ● చాలాచోట్ల మెనూ ప్రకారం వడ్డించని పరిస్థితి

- మూడునెలల బిల్లులు రావాలంటున్న నిర్వాహకులు
- విద్యార్థుల కంచాల్లో కానరాని కూరగాయలు, ఆకుకూరలు
- తనిఖీలు చేపట్టకపోవడంతో గాడితప్పిన వైనం
- కిచెన్ షెడ్లు లేక ఆరు బయటే వంటావార్పు
- పలు పాఠశాలల్లో 'ఆంధ్రజ్యోతి' పరిశీలన

ఆంధ్రజ్యోతి పరిశీలన



బెజ్జంకి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం వడ్డన



మిరుదొడ్డి పాఠశాలలో కూరకు బదులుగా వడ్డిస్తున్న సాంబారు

'మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనంలో కూరతో పాటు సాంబారు వడ్డించాలి. అయితే పప్పుతో కూడిన సాంబారును మాత్రమే విద్యార్థులకు వడ్డించారు. జనవరి నుంచి ఇప్పటి వరకు బిల్లులు సరిగా రాలేదని, కోడిగుడ్లకు తక్కువగా చెల్లిస్తున్నారని ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు.'

'నంగునూరు మండలంలోని పలు పాఠశాలల్లో వడ్డించిన మధ్యాహ్న భోజనంలో మెనూ గాడితప్పింది. ఒక్కోచోట ఒక్కో రకంగా కూరలు వడ్డించారు. పచ్చిపులుసు, శనగపప్పు, ఆలుగడ్డ, సోరకాయ ఇతరాత్ర కూరలు కనిపించాయి. వాస్తవానికి మెనూ ప్రకారం మంగళవారం అన్ని రకాల కూరగాయల కర్రీ పెట్టాలి. కాని వడ్డించలేదు. పెండింగ్ బిల్లులు బకాయి ఉండడంతో అప్పులు తెచ్చి వడ్డిస్తున్నామని ఆవేదన చెందుతున్నారు.'

'బెజ్జంకి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన మధ్యాహ్న భోజన నిర్వాహకులకు మూడు నెలలుగా బిల్లులు రాలేదట. దీంతో మెనూ పక్కన పెట్టి అన్నం, సాంబారు మాత్రమే వడ్డించారు. ఆ సాంబారు కూడా నీళ్లలాగా ఉందని విద్యార్థులు పెదవి విరిచారు. కోడిగుడ్లకు సైతం ఒక రూపాయి తక్కువగా ఇస్తున్నారని, నిర్వాహణ భారంగా మారిందని మరోవైపు నిర్వాహకులు చెబుతున్నారు.'

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూలై 8

జిల్లాలోని పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్నభోజన పథకం అస్తవ్యస్థంగా మారుతోంది. బకాయిలు చెల్లించడం లేదనే కారణాలతో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందడం లేదు. పోషకాహార లోపం తో విద్యార్థులు ఇబ్బందులు పడే పరిస్థితులు దాపురిస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు, సంబంధిత శాఖ అధికారులు ఈ విషయాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. మంగళవారం పలు పాఠశాలల్లో 'ఆంధ్రజ్యోతి' పరిశీలన చేయగా వాస్తవాలు వెలుగుచూశాయి.

అప్పు చేసి పప్పుకూడు..

జిల్లావ్యాప్తంగా ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు మధ్యాహ్న భోజనం నిర్వహణ చేపడుతున్న ఏజెన్సీలకు గత మార్చి నుంచి డబ్బులు రాలేదు. అదే విధంగా 9, 10 తరగతుల విద్యార్థులకు వంట చేసిపెడుతున్న వారికి గత జనవరి నుంచి బిల్లులు రావాల్సి ఉందని చెబుతున్నారు. మెనూ ప్రకారం వండాలంటే అప్పులు తేవడమే శరణ్యంగా భావిస్తున్నారు. ఫలితంగా చాలా స్కూళ్లలో ఆకుకూరలకు బదులుగా పప్పు, సాంబారుతోనే సర్దుతున్నారు. కోడిగుడ్డుకు బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధర కంటే ఒక రూపాయి తక్కువగా చెల్లిస్తున్నారని వాపోతున్నారు. కోడిగుడ్డు ధరలో వ్యత్యాసం కారణంగా పిల్లలకు చిన్నసైజు గుడ్లు, నాణ్యత లేని గుడ్లు వడ్డిస్తున్నవాళ్లు లేకపోలేదు. తనిఖీలు చేపడితే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. లేదంటే

మిగతా 8వ పేజీలో



తొగుట మండలం గోవర్ధనగిరి పాఠశాలలో తరగతి గది ఆవరణలోనే వంట



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

మెస్ ఏర్పాటు చేయాలి

- సిద్దిపేట పీజీ కళాశాల హాస్టల్ విద్యార్థుల ఆందోళన

సిద్దిపేట కల్చరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్శిటీ పరిధిలోని సిద్దిపేట పీజీ కళాశాల హాస్టల్ విద్యార్థులు మంగళవారం ఆందోళనకు దిగారు. తమకు హాస్టల్ సౌకర్యం ఉంది కానీ మెస్ ఫెసిలిటీ లేదని నిరసన చేపట్టారు. అడ్మిషన్ సమయంలో హాస్టల్ ఉందనే విషయం మాత్రమే తెలుసని, కానీ ఇక్కడికి వచ్చాక మెస్ సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. దాదాపు 100 మంది వరకు హాస్టల్‌లో ఉంటున్నారని, మెస్ ఏర్పాటు విషయాన్ని పలుమార్లు యూనివర్సిటీ దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. తమ ఇబ్బందులను గుర్తించి తమకు మెస్ సౌకర్యం కల్పించాలన్నారు.

చంద్లాపూర్‌ను సందర్శించిన తమిళనాడు బృందం



చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద తమిళనాడు బృందం సభ్యులు

చిన్నకోడూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ గ్రామాన్ని మంగళవారం తమిళనాడుకు చెందిన 30 మంది ప్రజాప్రతినిధులు, అధికారుల బృందం సందర్శించి గ్రామ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు నర్సరీ, పల్లె ప్రకృతివనం, డంపింగ్ యార్డు, శ్మశాన వాటిక, ఆయిల్ పాం నర్సరీ, రైతు వేదికలో రైతులతో సమావేశం, గ్రామ పంచాయతీ కార్యకలాపాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీపీవో దేవకిదేవి, డీఎల్పీవో మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీడీవో జనార్ధన్, ఎంపీవోలు సోమిరెడ్డి, మల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శి మల్లేశం, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

- కలెక్టర్ హైమావతి



కోహెడ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

కోహెడ, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన విషయంలో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ కె.హైమావతి హెచ్చరించారు. మంగళవారం కోహెడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు భోజనం వడ్డించే ప్రాంతం శుభ్రంగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలుగడ్డ కూర మాత్రమే వండినట్లు కలెక్టర్‌కు నిర్వాహకులు తెలిపారు. మెనూ ప్రకారం సాంబారు ఎందుకు చెయ్యలేదని ప్రశ్నించారు. ఈ ఒక్క రోజే ఇలా జరిగిందని రోజూ పాటిస్తున్నామని హెచ్‌ఎం మహమూద్, వంట సిబ్బంది కలెక్టర్‌కు విన్నవించారు. అంతకుముందు మండల సమాఖ్య భవనంలో స్టీల్ బ్యాంక్‌ను ఆమె పరిశీలించారు. ఆమె వెంట డీపీవో దేవకిదేవి, మండల ప్రత్యేక అధికారి ప్రవీణ్, ఎంపీడీవో కృష్ణయ్య, తహసీల్దార్ సమీర్ అహ్మద్, ఎంపీవో శోభ, వివిధ శాఖల సిబ్బంది ఉన్నారు.

కోహెడ మండలం తంగళ్లపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల పేరిట టోకెన్‌లు తీసుకుని అక్రమంగా ఇసుకను వేరొక చోటుకు రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను కలెక్టర్ పట్టుకున్నారు. అక్రమ రవాణా చేస్తే ఉపేక్షించేది లేదన్నారు.

పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలి

చిన్నకోడూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతీ పౌరుడు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని కలెక్టర్ హైమావతి సూచించారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం చంద్లాపూర్ శివారులోని పశుసంవర్ధక పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటి మాట్లాడారు. మండలంలోని గంగాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు (ముగ్గు పోసే కార్యక్రమాలను) ఆమె క్షేత్ర స్థాయిలో పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్లు నిర్మించుకోవడానికి డబ్బు లేని నిరుపేదలకు ఐకేపీ ద్వారా రుణసాయం అందించాలని డీఆర్డీవో పీడీ జయదేవ్ ఆర్యను ఆదేశించారు. అనంతరం చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్ రిజర్వాయర్‌ను సందర్శించారు. రిజర్వాయర్‌ను, గెస్ట్ హౌస్, సొరంగ మార్గంలోని పంప్ హౌస్, సర్జ్‌పుల్‌ను పరిశీలించారు. ఇరిగేషన్ డీఈ చంద్రశేఖర్ పంప్ హౌస్ పనితీరు, రిజర్వాయర్ వివరాలను కలెక్టర్‌కు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ సలీం మియా, ఎంపీడీవో జనార్దన్, ఎంపీవో సోమిరెడ్డి, ఆర్ఐ మల్లికార్జున్, కళాశాల ప్రిన్సిపల్ పరశురాములు తదితరులు పాల్గొన్నారు.



ప్రొబెషనరీ ఎస్ఐలకు పోస్టింగ్‌లు

సిద్దిపేట క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రొబెషనరీ ఎస్ఐలకు నూతనంగా పోస్టింగులు ఇచ్చారు. ఎస్ఐలు వారికి కేటాయించిన పోలీస్‌స్టేషన్లలో బాధ్యతలు స్వీకరించి మంగళవారం మర్యాదపూర్వకంగా పోలీస్ కమిషనర్ అనురాధను కలిశారు. సీపీ వారిని అభినందించి మాట్లాడారు. నిత్యం అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు పెద్దపీట వేయాలన్నారు. గంజాయి, మత్తుపదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు.

బాధ్యతలు చేపట్టిన వారిలో

సౌజన్య, బెజ్జంకి ఎస్ఐ, సమత మిరుదొడ్డి, మానస రాయపోల్, కీర్తిరాజు దుబ్బాక, నవీన్ చేర్యాల, అరుణ్‌కుమార్ దౌల్తాబాద్, ప్రశాంత్ అక్కన్నపేట, మమ్మద్ సైఫ్ అలీ చిన్నకోడూర్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు.

కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

చేర్యాల, జూలై 8(ఆంధ్రజ్యోతి) : చేర్యాలలో ఇటీవల నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంగా మార్చిన సిద్దిపేట జిల్లా కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం నాయకులు మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఫిర్యాదు చేశారు. జిల్లాలో జరిగే ప్రతీ అధికారిక కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీనాయకులు, ప్రజాప్రతినిధులకే ఒత్తాసుపలుకుతున్నారన్నారు. ప్రొటోకాల్ విరుద్ధమైనప్పటికీ అనధికార వ్యక్తులను ప్రోత్సహిస్తూ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారన్నారు. ఈ విషయమై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి కోరారు.

'సిగాచి' ప్రమాదం..

చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి

- 44కు చేరిన మృతుల సంఖ్య
- ఇంకా లభ్యం కాని ఎనిమిది మంది ఆచూకీ
- డీఎన్ఏ పరీక్షల్లో తీవ్ర జాప్యం
- దంతాల కోసం బూడిదలో అన్వేషణ



సిగాచీ పరిశ్రమలో శిథిలాల గుట్టలు

పటాన్‌చెరు/పటాన్‌చెరు రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సిగాచీ పరిశ్రమ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరో ఇద్దరు కార్మికులు మంగళవారం ఉదయం మృతిచెందారు. దీంతో మృతిచెందిన వారి సంఖ్య 44కు పెరిగింది. మరో ఎనిమిది మంది కార్మికులు గల్లంతయ్యారు. వారి ఆచూకీ కోసం చేస్తున్న అన్వేషణలో ఎలాంటి పురోగతి కనిపించలేదు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి పాన్ ఫనేషియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీహార్‌కు చెందిన ఆరీఫ్ (26), పటాన్‌చెరు ధృవ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన అఖిలేశ్వర్ (28) మృతి చెందారు. సంఘటన అనంతరం ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ మొత్తం ఎనిమిది మంది మృతి చెందారు. మరో 13 మందికి చికిత్స కొనసాగుతోంది. ఇందులో ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు పేర్కొన్నారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారు రోజుకొకరు చొప్పున మృతి చెందడంపై బాధిత కుటుంబాలలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. తమవారికి మెరుగైన వైద్యం అందించాలని వేడుకుంటున్నారు.

దొరకని ఆచూకీ

ప్రమాదంలో గల్లంతైన ఎనిమిది మంది బాధితుల కోసం చేపడుతున్న అన్వేషణలో ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. గల్లంతైన వారిలో సీనియర్ మేనేజర్ సిల్వేరు రవి, ఉద్యోగి జి.వెంకటేశ్, కార్మికులు విజయ్‌కుమార్ నిషాద్, ఇర్ఫాన్ అన్సారీ, శివజీకుమార్, అకిలేష్‌కుమార్, సూర్యనేళ్ల జస్టిన్ ఉన్నారు. వీరంతా ప్రమాదం జరిగిన రోజు పరిశ్రమలో విధులకు హాజరయ్యారు. ప్రమాదం తరువాత కనిపించకుండా పోయారు.

కుటుంబ సభ్యుల ఆవేదన

గల్లంతైనవారి కోసం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారి కుటుంబ సభ్యులు తాత్కాలిక వసతి కేంద్రంలో ఉంటూ సహాయ కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్నారు. తమవారి ఆచూకీ తెలపాలని, లేదా వారి బూడిదైనా ఇవ్వాలని ప్రాధేయ పడుతున్నారు. మరోవైపు సంఘటన

మిగతా 7వ పేజీలో

రైతన్నలు జర భద్రం

- వానాకాలంలో పొంచి ఉన్న విద్యుత్ ప్రమాదాలు
- వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తప్పనిసరి

7

గ్రంథాలయాల్లో 790 పోస్టుల భర్తీకి చర్యలు

- రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ అహ్మద్

7

పరిహారం.. పరేషాన్

- రూ.35 కోట్లు విడుదల చేసిన సిగాచి యాజమాన్యం
- వారసుల మధ్య వివాదాలు
- గ్రామసభల తీర్మానాలు తేవాలంటున్న అధికారులు

7



వన మహోత్సవ వేళ.. గొడ్డలి వేటు

పర్యావరణ పరిరక్షణకు వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటాలని పిలుపునిస్తూనే.. మరోవైపు మొక్కలు ఏపుగా పెరిగి చెట్లుగా మారడంతో వాటిపై గొడ్డలి వేటు వేస్తున్నారు. సిద్దిపేట పట్టణంలోని కరీంనగర్ రోడ్డు వైపున బాలాజీ థియేటర్ వద్ద గతంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి పచ్చనితోరణంలా కనువిందు చేస్తున్నాయి. పెరిగిన చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్నాయని వాటిని 75 శాతం మేర నరికివేశారు. ఇలా పదుల సంఖ్యలో చెట్లను నరికివేయడంతో పర్యావరణ ప్రేమికులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. బాధ్యులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

- సిద్దిపేట ఆంధ్రజ్యోతి, జూలై 8



మెరుగైన విద్యుత్ సరఫరా

మద్దూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సబ్‌స్టేషన్లలో అడిషనల్ పీటీఆర్‌లతో వినియోగదారులకు ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉండబోవని, నాణ్యవంతమైన, మెరుగైన విద్యుత్ అందుతుందని రూరల్ జోన్ సీజీఎం బాలస్వామి తెలిపారు. మంగళవారం మద్దూరు మండల కేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 3.5 ఎంవీఏ పీటీఆర్‌తో పాటు, దూల్మిట్ట మండలం బైరాన్‌పల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసిన 5 ఎంవీఏ పీటీఆర్‌ను ఎస్‌ఈ చంద్రమోహన్, డీఈ కృష్ణయ్య, హుస్నాబాద్ ఎంఆర్‌టీ పండరి, ఏడీ వెంకట్‌గౌడ్, ఏఈ రాజుతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. వినియోగదారులకు మరో రెండేళ్ల వరకు కావాల్సిన లోడ్‌కు అనుగుణంగా అడిషనల్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫలితంగా లోవోల్టేజీ, ఓవర్ లోడ్ సమస్య ఉండబోదన్నారు. ఈ కార్యక్రమంలో లైన్‌మెన్ శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మద్దూరు సబ్‌స్టేషన్‌లో 3.5 పీటీఆర్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

రోడ్డు దాటుతుండగా ప్రమాదం

● పలువురికి గాయలు

టేక్మాల్ జూలై 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండగా బస్సు వేగంగా వచ్చి కారుని ఢీ కొట్టింది. ఈ సంఘటన టేక్మాల్ మండల పరిధిలోని బోడ్మాట్ పల్లి గ్రామ శివారులోని 161 జాతీయ రాహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారును హైదరాబాద్ నుంచి నారయణఖేడ్‌కు వస్తున్న బస్సు బోడ్మాట్‌పల్లి క్రాస్ చేస్తుండగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయణిస్తున్న నర్సింలు, విజయలక్ష్మి, క్రిష్ణవేణికి తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాయలైనవారిని జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కాపర్ వైరు చోరీ


ధ్వంసం చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

చిన్నశంకరంపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వ్యవసాయ పొలం వద్ద గుర్తు తెలియని దుండగులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్ వైరును దొంగలించారు. ఈ సంఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. బాధిత రైతులు మాట్లాడుతూ వ్యవసాయ క్షేత్రాల వద్ద బోరు బావులకు సరఫరా అయ్యే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి కాపర్ వైరును దొంగలించినట్లు తెలిపారు. ఈమేరకు బాధిత రైతులు, విద్యుత్ లైన్ మేన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

● రూ. 8 లక్షల విలువ గల బంగారు నగలు అపహరణ

కల్హేర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాసాన్‌పల్లిలో గుర్తు తెలియని వ్యక్తులు తాళం వేసి ఉన్న ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న రూ. 8లక్షల విలువ గల 8 తులాల బంగారు నగలు దొంగిలించారు. ఈ సంఘటన సోమవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన ఉప్పరి పెద్ద నారాయణ అనే వ్యక్తి అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స కోసం వారం క్రితం భార్యతో కలిసి వెళ్లాడు. సోమవారం రాత్రి మాసాన్‌పల్లిలోని తన ఇంటికి తిరిగి చేరుకోగా బీరువాలో దాచిన నగలు లేకపోవడంతో లబోదిబోమన్నాడు. ఇంటి తాళం తీసిన దొంగలు బీరువా తాళాలు కూడా బీరువాపై ఉండటంతో బీరువా, లాకర్ తాళం తీసి అందులో ఉన్న 8 తులాల బంగారు నగలు దొంగిలించారు. మరో 15 తులాల వెండి వస్తువులు బీరువాలోనే ఉన్నా తీసుకోకుండా బంగారు నగలు మాత్రమే దొంగిలించడం పట్ల ఇంటి సంగతులు అన్ని తెలిసిన వారే ఈ దొంగతనానికి పాల్పడి ఉండవచ్చునని గ్రామస్థులు, పోలీసులు భావిస్తున్నారు. బాధితుడు కూతురు కవితను కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం అచ్చంపేట గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహం జరిపించగా గత సంవత్సరం డిసెంబరు మాసంలో కూతురు మరిణించింది. ఆమె వివాహం సందర్భంగా కట్నం కింద చేయించిన నగలు అత్తింటి వారు ఇవ్వడంతో వాటిని బీరువాలో దాచగా ఆ నగలనే గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించటం పట్ల నారాయణ దంపతులు కన్నీమున్నీరయ్యారు. మంగళవారం కల్హేర్ పోలీసులకు బాధితుడు నారాయణ ఫిర్యాదు చేయటంతో సంగారెడ్డి నుంచి పోలీసులు క్లూస్ టీంను రంగంలోకి దించి వేలిముద్రలు సేకరించారు. కల్హేర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. విలువైన వస్తువులు ఇంట్లోని బీరువాల్లో దాచి ఇంటికి తాళం వేసి వారం, పదిహేను రోజుల పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లవద్దని, వెళ్తే తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సామాజిక మాధ్యమాల్లో ఎంత ప్రచారం చేసినా ప్రజలు వినడం లేదు. తాళం వేసిన సమయాల్లో ఇంట్లో విలువైన వస్తువులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

గంజాయి పట్టివేత: ఒకరి అరెస్ట్


నిందితుడిని అరెస్ట్‌చేసి వివరాలు తెలుపుతున్న ఎస్సై నవీన్

చేర్యాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో గంజాయి పట్టుబడిన కేసులో అదే గ్రామానికి చెందిన మహమ్మద్ సోహెల్‌భాషాను అరెస్ట్ చేసినట్లు చేర్యాల ఎస్సై నవీన్ తెలిపారు. మంగళవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై నవీన్, కొమురవెల్లి ఎస్సై రాజుతో కలిసి నిందితుడి వివరాలు వెల్లడించారు. గ్రామశివారులో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో మంగళవారం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, చేర్యాల పోలీసులు దాడులు చేపట్టగా, సోహేల్ పాషాను పట్టుకుని 115గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి జ్యూడీషియల్ రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. హైదరాబాద్ దూల్‌పేట వద్ద గుర్తుతెలియని వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు.

భగవత్ సంకల్పంతోనే సంజీవని

● గుండె ఆపరేషన్ విజయవంతం
● సత్యసాయి సంజీవని హార్ట్‌అండ్ రీసెర్చ్ సెంటర్ చైర్మన్ శ్రీనివాస్

కొండపాక, జూలై8 (ఆంధ్రజ్యోతి): రంధ్రంపడిన పసిహృదయాలను కాపాడి, భవిష్యత్ తరాలను అందించాలనీ, ఏర్పడిన సత్యసాయి సంజీవనీ ఆసుపత్రి మానవసేవ మందిరంలాంటిదని సత్యసాయి సంజీవని హార్ట్ అండ్ రీసెర్చ్ సెంటర్ చైర్మన్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కొండపాక శివారులోని సత్యసాయి సంజీవనీ హార్ట్‌అండ్ రీసెర్చ్ సెంటర్ ఆసుపత్రిలో గుండె ఆపరేషన్ అయిన ముప్పైమంది చిన్నారులకు గిఫ్టఆఫ్‌లైఫ్ సర్టిఫికెట్ల ప్రదానం చేశారు. గిఫ్టఆఫ్‌లైఫ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కొండపాక శివారులో ఇలాంటి ఆసుపత్రి ఏర్పడటం భగవత్ సంకల్పం అన్నారు. నవంబర్‌లో ప్రారంభమైన ఉచిత ఆపరేషన్‌ల ప్రక్రియ ఇప్పటివరకు నూటముప్పైఎనిమిది ఆపరేషన్‌లను విజయవంతం చేశామన్నారు. పిల్లల తల్లితండ్రుల కళ్లల్లో ఆనందం చెప్పలేనిదన్నారు. మారుమూల ప్రాంతం నుంచి ఇక్కడికి వచ్చి ఆపరేషన్‌లు చేయించుకుంటున్నారన్నారు. చిన్నారుల గుండె చిదిరమైనవారికి మా ఆసుపత్రి సంజీవనిగా నిలుస్తుందన్నారు. దీనిని తాము దైవసేవగా భావిస్తామని, ఆపదలో ఆదుకుని వారిలో సంతోషం నింపడమే బాబా నేర్పిన మార్గమన్నారు.

సెల్‌ఫోన్ కొనివ్వలేదని..


షేక్ ఆసిఫ్ (ఫైల్)

చేగుంట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ ఫోన్ (సెల్‌ఫోన్) ఇప్పించలేదని యువకుడు ఇంట్లో నుంచి అలిగి వెళ్లిపోయాడు. ఈ సంఘటన చేగుంట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం: గ్రామానికి చెందిన షేక్ ఆసిఫ్ (16) అనే యువకుడు (విద్యార్థి) తల్లిదండ్రులు స్మార్ట్ ఫోన్ ఇప్పించలేదని అలిగి ఈనెల 4న రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. చుట్టుపక్కల బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లేకపోవడంతో తండ్రి షేక్ సాదుల్ మంగళవారం చేగుంట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

నర్సాపూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మండలం అచ్చంపేటకు చెందిన 19 ఏళ్ల యువతి అదృశ్యమైంది. కుటుంటబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింగం తెలిపారు. మంగళవారం సాయంత్రం ఎస్సై విలేకరులతో మాట్లాడుతూ.. అచ్చంపేటకు చెందిన చాకలిపోచమ్మ, అంజనేయులు దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. ఈ నెల 7న ఉదయం భార్యభర్తలతో పాటు ఇద్దరు కుమారులు కూలీ పనికి వెళ్లారు. కూతురు సురేఖ(19) పదోతరగతి వరకు చదువి ఇంటి వద్దనే ఉంటుంది. అయితే ఇంట్లో ఉన్న కూతురు సాయంత్రం వచ్చి చూసేసరికి లేకపోవడంతో అంతటా వెతికినా, బంధువులను ఆరా తీసినా ఆచూకీ లేదు. మంగళవారం సాయంత్రం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అయితే ఇంట్లో ఉన్న 15వేల రూపాయలు వెంట తీసుకుని వెల్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతి

పటాన్‌చెరు రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రుద్రారం గ్రామంలోని పెద్ద చెరువులో విద్యుత్ షాక్‌తో మూడు గేదెలు మృతి చెందాయి. దీంతో గ్రామస్థులు తీవ్ర అందోళన చెందుతున్నారు. చెరువు లోపల విద్యుత్ స్తంభాలు ఉండటం వల్లే గేదెలు విద్యుదాఘాతానికి గురై మరణించాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గతంలో కూడా ఇదే చెరువులో విద్యుత్ షాక్ తగిలి ఒక బర్రె మరణించినట్లు వారు గుర్తు చేస్తున్నారు. గతంలో ఈ చెరువులో బోర్లను వేసి నీటిని వాడుకున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ ఘటనపై నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని వారు కోరారు. కాగా చనిపోయిన గేదెలు తన జీవనాధారమని బాధితుడు మహేష్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఘటన వల్ల తాను నాలుగు లక్షల రూపాయల వరకు నష్టపోయానని, అధికారులు తనను ఆదుకోవాలని కోరాడు.

పాముకాటుకు గేదె మృతి

పాముకాటుతో పాడిగెదే మృతిచెందింది. ఈ ఘటన మంగళవారం దుబ్బాకలో జరిగింది. పట్టణానికి చెందిన బాలుగారి మల్లవ్వకు చెందిన పాడిగెదెను సోమవారం వ్యవసాయ పొలంవద్దకు కట్టేసి ఇంటికి వచ్చారు. తెల్లవారుజామున పొలం వద్దకు వెళ్లి చూసేసరికి పాముకరిచి మృతి చెంది ఉండడంతో మహిళా రైతు బోరనవిలపించింది. పాడిగెదే మృతితో సుమారు లక్షరూపాయాల నష్టం వాటిల్లిందని తెలిపారు. తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని విన్నవించారు.

బీఎస్‌ఎన్‌ఎల్‌లోని డిస్ట్రిబ్యూటర్ గదిలో రూ.1500 చోరీ

నర్సాపూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ బీఎస్‌ఎన్‌లో కార్యాలయంలో ఓ గదిలో డిస్ట్రిబ్యూటర్ గదిలో చోరీ జరిగింది. అందులో ఉన్న రూ.1500 అపహరణకు గురైనట్లు ఎస్సై లింగం తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఎస్ఎన్‌ఎల్‌లోని డిస్ట్రిబ్యూటర్ గదిని ఈ నెల 5 సాయంత్రం తాళం వేసి వెళ్లి తిరిగి 7వ తేదీన తెరవడానికి వెళ్లగా తలుపులు తెరిచి ఉండటంతో అనుమానం వచ్చి లోనికి వెళ్లిచూడగా ఎవరో దొంగలు దూరి గదిలోని డ్రాలో ఉన్న రూ.1500 ఎత్తుకెళ్లినట్లు డిస్ట్రిబ్యూటర్ నిర్వాహకుడు పూర్ణచందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పరిహారం.. పరేషాన్



- సిగాచి మృతుల కుటుంబాలకు పంపిణీకి అడ్డంకులు
- హక్కుదారులమంటూ ఇద్దరు భార్యలు వారి సంతానం పోరాటం
- గ్రామసభలు నిర్వహించి తీర్మాన పత్రాలు తేవాలంటున్న అధికారులు
- రూ.కోటి పంపిణీపై మల్లగుల్లాలు.. ప్రాథమికంగా రూ.35కోట్లు విడుదల

రామచంద్రాపురం టౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచి పరిశ్రమలో జరిగిన పేలుళ్ల ప్రమాద ఘటనలో మరణించిన కుటుంబాలకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన రూ.కోటి పరిహారం పంపిణీ వ్యవహారం అధికారులకు తలనొప్పిగా మారింది. హక్కుదారులు ఎవరు అనే దానిపై అధికారులకు స్పష్టమైన సమాచారం అందడం లేదు. దీనిపై సందిగ్ధతకు గురైన అధికార యంత్రాంగం, మృతుల కుటుంబసభ్యుల గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, హక్కుదారులు వీరేనని, వీరికి పరిహారం చెల్లించండని తీర్మానం పత్రాలు తెప్పించుకోవాలని నిర్ణయించింది. దీనికి జిల్లా యంత్రాంగం సమాయత్తమవుతోంది.

ప్రమాదంలో చనిపోయిన వారికి ఇద్దరు భార్యలు ఉన్నారంటూ కొందరు ముందుకు వస్తున్నారు. పరిహారం తమకే ఇవ్వాలంటూ అన్నదమ్ములు, వారసులు అధికారులను కోరుతున్నారు. గతంలో పటాన్‌చెరులోని ఏషియన్ పెయింట్స్ పరిశ్రమలో ఒక కార్మికుడు అనారోగ్యంతో చనిపోతే, పరిశ్రమ యాజమాన్యం రూ.8 లక్షలు పరిహారం చెల్లించింది. ఆ డబ్బులు తమకే ఇవ్వాలంటూ ఇద్దరు భార్యల కుటుంబాలు ముందుకు రావడంతో, యాజమాన్యానికి ఏం చేయాలో అర్థం కాక చెల్లింపులు నిలిపివేసింది. 10 ఏళ్లుగా పరిహారం డబ్బులు ఇప్పటికీ కంపెనీలోనే ఉండి, కోర్టులో కేసు నడుస్తోంది. ఇటువంటివి పునరావృతం కాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. పరిహారం చెల్లింపు విషయంపై కంపెనీ ప్రతినిధులపై మంత్రి దామోదర రాజనర్సింహ తన కార్యాలయంలో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఫలితంగా, ప్రాథమికంగా కంపెనీ యాజమాన్యం రూ.35 కోట్లు విడుదల చేసింది. శాశ్వత ప్రాతిపదికన పని చేస్తున్న వారి పేర్లపై కోటి రూపాయల చొప్పున చెక్కులు సిద్ధం చేసినట్లు సమాచారం.

సీఎం కార్యాలయంలో పీపీటీ

సిగాచి ఘటనలో అధికారులు తీసుకున్న చర్యలపై బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి కార్యాలయంలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వనున్నారు. ఇందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రమాదం జరిగిన రోజు నుంచి నేటి వరకు తీసుకున్న అన్ని రకాల జాగ్రత్తలపై వివరించనున్నారు. పరిహారం చెల్లింపు విషయంలో ఎంతమందికి, ఎలా, ఎంత చెల్లించాలనే దానిపై అధికారులు సీఎం దృష్టికి తీసుకురానున్నారు.

శాఖాపరమైన చర్యలపై..

ప్రమాద ఘటన విషయంలో నీటి ఆవిరి ప్రయాణం జరుగుతున్న పైపుల నిర్వహణ విషయంలో అధికారులు ఎటువంటి సూచనలు జారీ చేశారనే దానిపై దాదాపు విచారణ పూర్తయింది. ఆవిరి గాలిరూపంలో ప్రయాణం చేస్తున్న పైపులను వివిధ విభాగాలకు అనుసంధానం చేశారు. వాటిల్లో ఏ ఒక్క పైపులో రవాణా సక్రమంగా జరగకపోతే మరో పైపుపై ఒత్తిడి పెరిగిందని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. కుక్కర్‌లో ఆవిరి పెరిగినప్పుడు విజిల్ పనిచేస్తుంది. అదే రీతిలో ఆయా పైపులకు చిన్న చిన్న మూతలు (ప్రెషర్ రిలీఫ్ వాల్వ్) ప్రెజర్ పెరిగినప్పుడు తెరుచుకుంటాయి. ప్రమాదం జరిగిన రోజున అవి పనిచేయకపోవడం వల్లే ఒక్కసారిగా ఎయిర్ ప్రెషర్ పెరిగి పేలిపోయిందని నిర్ధారణకు వచ్చారు. దీని విషయంలో సంబంధిత శాఖల అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసినట్లు సమాచారం.



పరిశ్రమలో శిథిలాలు

సిగాచి ప్రమాదం.. చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి

(5వ పేజీ తరువాయి)

స్థలంలో లభించిన శరీర అవశేషాలను, ఎముకలను భద్రపర్చి డీఎన్ఏ పరీక్షకు పంపారు. గల్లంతైన వారి తల్లిదండ్రులు, తోబుట్టువుల రక్తనమూనాలను సేకరించి పంపారు.

దంతాల కోసం అన్వేషణ

ప్రమాదం జరిగిన సిగాచి పరిశ్రమలో అధిక ఉష్ణోగ్రతకు పలువరు సజీవ దహనమయ్యారని భావిస్తున్నారు. పరిశ్రమ శిథిలాల కింద బూడిదలో లభించిన ఎముకలను పరీక్షలకు పంపారు. అధిక ఉష్ణోగ్రతల వద్ద ఎముకల్లోని డీఎన్ఏ గుర్తించడం సాధ్యపడటం లేదని తెలిసింది. దంతాల ద్వారా డీఎన్ఏ పరీక్షలు చేయడం సులభమని భావించి, బాధితుల దంతాలను గుర్తించేందుకు అన్వేషణ చేస్తున్నారు. అలాగే, మరోసారి కుటుంబ సభ్యుల రక్త నమూనాలను సేకరించి డీఎన్ఏ పరీక్షల కోసం పంపారు. ఒకటి రెండు రోజుల్లో గల్లంతైనవారి డీఎన్ఏను గుర్తించే అవకాశాలున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

రైతన్నలు జర భద్రం

- వానాకాలంలో పొంచి ఉన్న విద్యుత్ ప్రమాదాలు
- వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తప్పనిసరి



అక్కన్నపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : వానాకాలంలో రైతులకు విద్యుత్‌తో ప్రమాదాలు పొంచి ఉన్నాయని, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. పంట పొలాల వద్ద విద్యుత్ వినియోగంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు తక్కువగా ఉన్నందున బోరు బావులు, వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేసి సాగు చేస్తున్నారని, చిన్న పొరపాటు జరిగినా ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని అధికారులు పేర్కొన్నారు. అక్కన్నపేట మండలంలోని పంతులుతండాకు చెందిన రైతు బానోతు కిష్టునాయక్ వారం రోజుల క్రితం విద్యుత్ షాక్‌తో మరణించారు. ఈ నేపథ్యంలో అన్నదాతలు అధికారులు పలు సూచనలు చేస్తున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు

- విద్యుత్ మోటార్లు, స్టార్టర్ బోర్డులు నేలపై కాకుండా ఎత్తైన గద్దెలపై ఏర్పాటు చేసి తడవకుండా చూసుకోవాలి.
- మోటార్లు పాడైతే సొంతంగా ప్రయత్నించకుండా మెకానిక్‌తోనే మరమ్మతులు చేయించాలి.
- మోటార్లకు వాడే సర్వీస్ వైర్లు నాణ్యమైనవి అయి ఉండాలి. వైర్లు దెబ్బతింటే వెంటనే టేపు వేయాలి.
- సబ్‌మెర్సిబుల్ మోటార్ల వైర్ తెగితే పైన ఉన్న పరికరాలకు విద్యుత్ సరఫరా జరిగే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలి.
- ట్రాన్స్‌ఫార్మర్ వద్ద లేదా మోటార్ స్టార్టర్ స్విచ్ ఆన్/ఆఫ్ చేసేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలి.

నష్టపరిహారం ఇలా..

విద్యుత్ సంస్థ ప్రమాదాలకు మూడు రకాలుగా నష్టపరిహారం అందిస్తుంది. విద్యుత్ తీగలు తెగిపడి మనుషులు లేదా పశువులు మరణిస్తే పరిహారం లభిస్తుంది, కానీ గాయాలకు చెల్లించదు. మనిషి మరణిస్తే రూ.5 లక్షలు, పశువులు మృతిచెందితే రూ.40 వేలు, మేకలు, గొర్రెలకు రూ.8 వేలు నష్టపరిహారం చెల్లిస్తున్నది. నష్టపరిహారం కోసం మనుషులైతే ఘటనా స్థలంలో ఫోటోలు, పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు, శవ పంచనామా పత్రాలను విద్యుత్ అధికారులకు సమర్పించాలి. అలాగే పశువులు చనిపోతే ఫోటోలతో పాటు వెటర్నరీ డాక్టర్ పోస్టుమార్టం నివేదికను విద్యుత్ అధికారులకు అందజేయాలి.

రైతులు జాగ్రత్తగా ఉండాలి



వర్షాకాలంలో ప్రమాదాలకు గురికాకుండా రైతులు జాగ్రత్తగా ఉండాలి. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద స్విచ్‌లను ఆన్/ఆఫ్ చేసేటప్పుడు అప్రమత్తం తప్పనిసరి. ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక లోడ్ ఉంటే ముందే సమాచారం ఇవ్వాలి. తీగలు తెగిపడిన లేదా కిందికి వేలాడుతున్న విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేయించాలి.

\- రావుల కృష్ణయ్య, విద్యుత్ శాఖ డీఈ, హుస్నాబాద్

కొడంగల్‌కు ఓ న్యాయం.. గుమ్మడిదలకు మరో న్యాయమా?

- ఎకరాకు రూ.70 లక్షలు, 300 గజాల స్థలం ఇవ్వాల్సిందే
- తహసీల్దార్‌కు విన్నవించిన భూ బాధితులు



వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నేత గోవర్ధన్ రెడ్డి, రైతులు

గుమ్మడిదల, జూలై 8(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల పరిధిలోని సర్వే నంబర్ 109లో భూములు కోల్పోతున్న రైతులు పరిహారం చెల్లింపులలో ప్రభుత్వం వివక్షత చూపుతోందని ఆందోళన బాట పట్టారు. సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గంలో రైతులకు ఎకరానికి రూ.70 లక్షలు, 300 గజాల స్థలం, ఇల్లు ఇస్తుంటే, గుమ్మడిదల రైతులకు అదే న్యాయం ఎందుకు చేయడం లేదని పలువురు ప్రశ్నించారు. ఇక్కడా అలాంటి పరిహారమే ఇవ్వాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రైతు సంఘాల నాయకులు బాధిత రైతులతో కలిసి గుమ్మడిదల తహసీల్దార్ పరమేశంకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఈ భూమిని ఇండస్ట్రియల్ పార్కుకు కేటాయిస్తామని చెప్పారని, అప్పుడు రైతులకు 600 గజాల స్థలం ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ రైతుల కోసం 1000 గజాల స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశామన్నారు. తాము రాజకీయాల కోసం కాదని, రైతులకు అండగా నిలబడటానికే పోరాటం చేస్తున్నామని స్పష్టం చేశారు. ఇతర పార్టీల నాయకులు కూడా రైతులకు మద్దతుగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కొంతమంది స్థానిక నాయకులు రైతులను తీసుకెళ్లి జిల్లా కలెక్టర్‌ను కలిసి సంతకాలు చేయించుకోవడం న్యాయం కాదని గోవర్ధన్ రెడ్డి అన్నారు. సర్వే నంబర్ 109 లో అసలైన అర్హుల పేర్లు తొలగించి, ఓ నాయకుడు తన పేరును ఎలా నమోదు చేయించుకున్నాడో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగేంతవరకు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో నాయకులు, బాధితులు బాలకృష్ణారెడ్డి, మద్దుల బాల్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, ఆంజనేయులు, సుధాకర్ రెడ్డి, జయపాల్ రెడ్డి, నారాయణ యాదవ్, బీరప్ప శ్రీకాంత్ గౌడ్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట వ్యక్తి హల్‌చల్

- ఒంటిపై పెట్రోల్ పోసుకున్న వైనం



బోయిని శేఖర్

జహీరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం హోతి(బి) గ్రామానికి చెందిన బోయిని శేఖర్ హల్‌చల్ చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. శేఖర్ కుమారుడు రాజు విద్యాభ్యాసం కోసం జనన ధ్రువీకరణ పత్రం అవసరం ఉన్నందున నెలరోజుల క్రితం మీసేవలో దరఖాస్తు చేశాడు. ఉన్నట్టుండి మంగళవారం ఉదయం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తన కుమారుడి బర్త్ సర్టిఫికెట్ ఇవ్వాలంటూ ఒంటిపై పెట్రోల్‌పోసుకుని ఆందోళనకు దిగాడు. ఈ క్రమంలో రెవెన్యూ సిబ్బంది జోక్యం చేసుకుని అతడిపై నీళ్లు పోసి సర్టిఫికెట్‌ను చేతిలో పెట్టి పోలీసులకు అప్పగించారు. సర్టిఫికెట్ స్టేటస్‌ను మీసేవలో చెక్ చేసుకోకుండా వచ్చి నేరుగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేయడాన్ని అధికారులు తప్పుపట్టారు.



తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న రాధాకిషన్

ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మక విద్య

- మెదక్ డీఈవో రాధాకిషన్

శివ్వంపేట/రామచంద్రాపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన గుణాత్మక విద్య అందుతుందని మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్ పేర్కొన్నారు. మంగళవారం గొట్టిముక్ల, గోమారం ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు చూడాలన్నారు. తల్లిదండ్రులు పాఠశాలను సందర్శించి తమ పిల్లల విద్యపై శ్రద్ధ వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బుచ్చానాయక్, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్ తల్లిదండ్రులపై కూడా ఆధారపడి ఉంటుందని రామచంద్రాపురం ఎంఈవో రాథోడ్ అన్నారు. మంగళవారం తెల్లాపూర్‌లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు భాస్కర్, ఉపాధ్యాయులు జీ.హరీష్‌శంకర్, రేణుక, ఇందిరదేవి, అనురాధ, రంజిత్‌సాగర్, టీ.రాజేశ్వర్, మహేశ్వర్, భూపాల్‌రెడ్డి, లలిత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ అహ్మద్

గ్రంథాలయాల్లో 790 పోస్టుల భర్తీకి చర్యలు

- రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ అహ్మద్

నారాయణఖేడ్, జూలై 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గ్రంథాలయాల్లో ఖాళీగా ఉన్న 790 పోస్టులను భర్తీ చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ అహ్మద్ తెలిపారు. మంగళవారం నారాయణఖేడ్‌లోని గ్రంథాలయ విస్తరణ పనులకు ఎంపీ సురేష్ షెట్కార్, స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డిలతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ, గత 25 సంవత్సరాలుగా గ్రంథాలయాల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టలేదని, ప్రజా ప్రభుత్వం అన్ని శాఖల్లోనూ ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడానికి కృషి చేస్తోందని, ఇప్పటికే 60 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని గుర్తు చేశారు. కంగ్టిలో గ్రంథాలయ భవనం కోసం రూ.50 లక్షలు మంజూరు చేశామన్నారు. జహీరాబాద్‌లో గత ప్రభుత్వం గ్రంథాలయానికి రూ.54 లక్షలు మంజూరు చేసిన స్థలంలో ఆసుపత్రిని నిర్మించిందన్నారు. ఎంపీ సురేష్ షెట్కార్ మాట్లాడుతూ గ్రంథాలయంలో పుస్తకాల కోసం తన కోటా నుంచి రూ.5 లక్షలు మంజూరు చేస్తానని ప్రకటించారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ త్వరలో నిర్వహించనున్న ఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా నీట్ కోచింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. నియోజకవర్గంలోని 15 పెద్ద గ్రామాల్లో స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ అంజయ్య, కార్యదర్శి వసుంధర, ఆర్డీవో అశోక చక్రవర్తి, మున్సిపల్ తాజామాజీ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, కమిషనర్ జగ్జీవన్, గ్రంథాలయ అధికారిణి లలిత తదితరులు పాల్గొన్నారు. కాగా, గ్రంథాలయాల్లో ప్రత్యక్ష నియామకాలను చేపట్టాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యప్రసాద్ తదితరులు రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ అహ్మద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం చైర్మన్‌తోపాటు ఎంపీ, ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించారు.

డ్యూటీ మీట్‌లో మెదక్ పోలీసుల ప్రతిభ


- వివిధ విభాగాల్లో 10 పతకాలు కైవసం
- అభినందించిన మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



సిబ్బందిని అభినందిస్తున్న మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాలో సోమవారం జరిగిన జోనల్‌స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో మెదక్ జిల్లాకు చెందిన పోలీసుల అధికారులు తమ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి వివిధ విభాగాల్లో 10 పతకాలు అందుకున్నారు. కానిస్టేబుళ్లు దుర్గాప్రసాద్, సిద్దిరాములు యాక్సెస్ కంట్రోల్ విభాగంలో బంగారు పతకాలు, ఏఆర్ హెచ్‌సీ రవీందర్, పీసీ నర్సింహులు గ్రౌండ్ సెర్చ్ ఈవెంట్ విభాగంలో రెండో స్థానంలో నిలిచి వెండి పతకాలు సాధించారు. పీసీ సతీష్ కంప్యూటర్ అవేర్‌నెస్ విభాగంలో ప్రథమ స్థానంతో బంగారు పతకం, పీసీ అశ్వాక్ సైంటిఫిక్ ఎయిడ్ ఇన్వెస్టిగేషన్‌లో తృతీయ స్థానంలో నిలిచాడు. పీసీ శ్రీధర్‌గౌడ్ ఫొటో, వీడియో గ్రాఫీలో ప్రథమ స్థానం సాధించి 2 బంగారు పతకాలు కైవసం చేసుకున్నాడు. పీసీ శ్రవణ్‌కుమార్ డాగ్ స్క్వాడ్ నార్కొటిక్ విభాగంలో మూడో స్థానంలో నిలిచారు. ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని మెదక్ జిల్లా ఎస్పీ డీవీశ్రీనివాసరావు అభినందించారు. వచ్చే నెలలో జరిగే రాష్ట్రస్థాయిలో పోటీలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరి జాతీయ స్థాయి ఎంపిక కావాలి ఎస్పీ ఆకాంక్షించారు. పతకాలు సాధించిన సిబ్బందికి రివార్డులు మంజూరు చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మెదక్ జట్టు



రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనే మెదక్ జిల్లా జట్టు

మెదక్ అర్బన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు బుధవారం నుంచి ఈ నెల 12 వరకు మంచిర్యాల జిల్లాలో జరుగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు మెదక్ జిల్లా క్రీడాకారుల జట్టు తరలివెళ్లింది. జట్టుకు కోచ్‌గా జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారిణి భాగ్యమ్మ వ్యవహరించనున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగరాజు తెలిపారు.

కల్లు దుకాణాలే అడ్డా... ఒంటరి మహిళలే టార్గెట్

- ఎల్లవ్వ కేసును ఛేదించిన పోలీసులు
- నిందితులను విచారించగా మరిన్ని దొంగతనాలు వెలుగులోకి
- 8 తులాల బంగారం, 60 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం

కల్లు దుకాణాల వద్ద మాటు వేసి, ఒంటరిగా ఉన్న మహిళలతో మాట కలిపి.. మాయ చేసి నిలువునా దోచుకుంటున్నారు దుండగులు. ఓ కేసులో పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా ముఠా గుట్టురట్టయ్యింది. వారు పలు ప్రాంతాల్లో పాల్పడిన దొంగతనాలు బయటపడ్డాయి.

మెదక్ అర్బన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): కల్లు దుకాణలను అడ్డాగా చేసుకొని బంగారు, వెండి ఆభరణలను ధరించిన ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్న దొంగలను కస్టడీలోకి తీసుకొని విచారించగా.. పలు ప్రాంతాల్లో చేసిన దొంగతనాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుల వద్ద 8 తులాల బంగారం, 60 తులాల వెండి అభరణాలు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు వివరాలను వెల్లడించారు. హవేళీఘణపూర్ మండల పరిధిలోని కూచన్‌పల్లి గ్రామానికి చెందిన ఎరుకల ఎల్లవ్వ గత ఫిబ్రవరిలో మెదక్ పట్టణానికి వచ్చింది. స్థానిక రాందాస్ సమీపంలో ఉన్న నెం 1 కల్లు దుకాణంలో కల్లు తాగుతున్నది. అక్కడే ఒంటరి మహిళల కోసం మాటువేసి ఉన్న తూప్రాన్ మండల పరిధిలోని నాగులపల్లి గ్రామానికి చెందిన శివకుమార్, వట్టూర్ గ్రామానికి చెందిన వరలక్ష్మి, మాసాయిపేట మండల పరిధిలోని కొప్పులపల్లి గ్రామానికి చెందిన పెంటయ్య ఎల్లవ్వను గమనించారు. ఆమె దగ్గరి వెళ్లి పరిచయం చేసుకున్నారు. ఆమెకు కల్లు తాగించి కొంత దూరం తీసుకెళ్లి, మత్తులోకి వెళ్లగాను తులం బంగారం, 60 తులాల వెండికడియాలను తీసుకొని పరారయ్యారు. ఎల్లవ్వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తును ప్రారంభించారు. శివకుమార్‌ను అరెస్టు చేసి తులం బంగారం, 60 తులాల వెండికడియాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దొంగతనంలో వరలక్ష్మి, పెంటయ్య పాల్గొన్నట్లు చెప్పడంతో ఆ ఇద్దరి నిందితులను మనోహరాబాద్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులపై పీటీ వారెంట్ వేసిన పోలీసులు కస్టడీలోకి విచారించగా.. నర్సాపూర్, గజ్వేల్ ప్రాంతాల్లో దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారు. నర్సాపూర్‌లో జరిగిన చోరీ కేసులో 3 తులాల పుస్తెలతాడు, గజ్వేల్ చేసిన దొంతనం కేసులో 3 తులాల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. దాదాపు రూ.6 లక్షల విలువైన సొత్తును రికవరీ చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. దొంతనం కేసు ఛేదించిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ ప్రసన్నకుమార్, పట్టణ సీఐ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి నగలను చూపుతున్న మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

న్యూస్ బాక్స్

గోదావరి జలాలతో చెరువులు, కుంటలు నింపాలి : టీడీపీ

చేర్యాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురవక పంటలు ఎండిపోతున్న క్రమంలో గోదావరి జలాలతో చేర్యాల ప్రాంతంలోని చెరువులు, కుంటలు నింపాలని టీడీపీ రాష్ట్ర నాయకుడు ఒగ్గు రాజు పేర్కొన్నారు. మండలకేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీజన్ ప్రారంభం కావడంతో విత్తనాలు వేసినప్పటికీ వర్షాలు లేక నష్టపోయారని, తపాస్‌పల్లి, లద్నూరు రిజర్వాయర్లను నింపి తద్వారా చెరువులు కుంటలకు మళ్లించి పంటలు కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడతామన్నారు. సమావేశంలో నాయకులు పాము శివలింగం, ఎండీ ఎక్బాల్, వాసం భిక్షపతి, కనకచంద్రారెడ్డి, పుట్ట సంపత్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకార సంఘ కార్యవర్గం ఎన్నిక

చేర్యాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణ స్వర్ణకారసంఘం నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం జరిగింది. అధ్యక్షుడిగా మూటకోడూరు నాగరాజు, కార్యదర్శిగా జిన్నారం రమేశ్, కోశాధికారిగా కాసుల భరత్ ఎన్నికయ్యారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు పంపిణీ

కోహెడ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగసముద్రాల పాఠశాలలో చింతలపల్లి మల్లారెడ్డి, శాంతమ్మ జ్ఞాపకార్థం పాఠశాలలోని విద్యార్థులకు సుమారు రూ. 20 వేల విలువైన స్పోర్ట్స్ డ్రెస్సులను మంగళవారం అందజేశారు. ఈ పాఠశాలలో చదువుకున్నందున అదే అభిమానంతో విద్యార్థులకు డ్రెస్‌లను పంపిణీ చేసినట్టు వారి కుమారులు ప్రభాకర్‌రెడ్డి, రాజిరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రాళ్లబండ పద్మయ్య, హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు ఉన్నత పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సాయం

మద్దూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మద్దూరు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల అభివృద్ధికి 2004-05 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ. 36,100ల ఆర్థిక సహాయాన్ని మంగళవారం హెచ్‌ఎం చంద్రశేఖర్ శర్మకు అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. ముందు తరాలకు విద్యాబోధన అందించేందుకు పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చి ఆర్థిక సహాయాన్ని అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీజైన. రజినీకాంత్, పిడిశెట్టి గౌరీశ, దామెర ప్రేమ్ కుమార్, అమ్జద్, జుబేర్, రాజేశ్వరి, రాజ్‌కుమార్, బాల్‌రాజు, శంకర్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అందమైన చేతిరాత అందరికీ సాధ్యమే

మిరుదొడ్డి, జూలై 8 (ఆంధ్రజ్యోతి):అందమైన చేతిరాత అందరికి సాధ్యమేనని మిరుదొడ్డి మండల విద్యాధికారి ప్రవీన్‌బాబు అన్నారు. మంగళవారం మిరుదొడ్డి మండలం కాసులాబాద్ ప్రాథమిక పాఠశాలలో గ్రామ వ్యాస్తవ్యులు ఏతి బాలకిషన్ సహకారంతో రూ. 10వేల విలువైన చేతిరాతపుస్తకాలను ఉచితంగా విద్యార్థులకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఉన్నతశిఖరాలను అధిరోహించినప్పుడే తల్లితండ్రులకు, ఉపాధ్యాయులకు గర్వకారణమని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విఠల్, ఉపాధ్యాయులు తదితరు పాల్గొన్నారు.

బెక్కల్ శివాలితండా వాసికి డాక్టరేట్

మద్దూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దూళిమిట్ట మండలం బెక్కల్ గ్రామ శివాలి తండాకు చెందిన లకావత్ బాలాజీ కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ డాక్టరేట్ అందుకున్నారు. రాజనీతి శాస్త్రంలో ప్రొఫెసర్ వీరన్న పర్యవేక్షణలో 'తెలంగాణ రాష్ట్రంలోని ఆదర్శ పాఠశాల పనితీరు జనగామ జిల్లా పరిశీలన' అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించినందుకు కాకతీయ విశ్వ విద్యాలయం 23వ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు.

ఇలా వదిలేస్తే ఎలా?



ప్రజలకు అత్యవసర సమయంలో అందుబాటులో ఉండడం కోసం మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు అరబిందో ఫార్మా సహకారంతో గజ్వేల్ ఆస్పత్రికి అంబులెన్స్‌ను అందజేశారు. ఈ అంబులెన్స్‌ను అందజేసి దాదాపు మూడు నెలలు గడుస్తున్నా నేటివరకు వినియోగంలోకి తీసుకురాలేదు. ప్రజావసరాల కోసం వితరణగా వచ్చిన అంబులెన్స్‌ను వినియోగించకపోవడంతో రోగులు ప్రైవేటు అంబులెన్స్‌లను ఆశ్రయించాల్సివస్తున్నది. కాగా ప్రైవేటు అంబులెన్స్‌ల యజమానులతో అధికారుల కుమ్మక్కవడం వల్లే ఎంపీ ఇచ్చిన అంబులెన్స్‌ను వినియోగంలోకి తీసుకురావడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంబులెన్స్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

- గజ్వేల్, జూలై 8(ఆంధ్రజ్యోతి)

వినియోగంలోలేక ప్రజాధనం వృథా

గజ్వేల్ పట్టణంలో 2010లో రూ.95లక్షలు వెచ్చించి నిర్మించిన మండల పరిషత్ కార్యాలయం ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారిపోయింది. మూడేళ్ల క్రితం వరకు మండల ప్రజా పరిషత్‌గా, ఉపాధి హామీ కార్యాలయంగా సేవలందించిన ఈ భవనం నుంచి మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ఇంటిగ్రేటెడ్ కార్యాలయానికి తరలించడంతో భవనం ఖాళీ అయింది. నాటి నుంచి ఖాళీగా ఉండడంతో శిథిలావస్థకు చేరుకుంటుంది. ఈ క్రమంలో భవనం ఆవరణలో చుట్టుపక్కల వారు తమ వాహనాలను అక్కడే పార్క్ చేస్తుండడంతో పార్కింగ్ ఏరియాగా మారిపోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఏదైనా ప్రభుత్వ కార్యాలయానికి లేదా ఇతర ప్రజోపయోగ కార్యక్రమాలకు ఈ భవనాన్ని వినియోగిస్తే సద్వినియోగమవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

- గజ్వేల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి)



ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



నారాయణరావుపేట మండలం జక్కాపూర్ పీఎంశ్రీ జడ్పీహెచ్‌ఎస్‌లో తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో శ్రీనివాస్ రెడ్డి

సిద్దిపేట రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే అన్ని రకాల అభివృద్ధి, నాణ్యమైన విద్య సాధ్యమవుతుందని సిద్దిపేట జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నారాయణరావుపేట మండలం జక్కాపూర్ పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశానికి డీఈవో ముఖ్య అతిథిగా హాజరై తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ కొత్తగా 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు అభ్యసన సామర్థ్యాల పెంపుకోసం ఖాన్ అకాడమీతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందన్నారు. విద్యార్థులు ప్రతి రోజూ క్రమం తప్పకుండా హాజరయ్యేటట్లు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధిస్తూ జిల్లాలోనే అగ్రగామిగా నిలుస్తున్న జక్కాపూర్ పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షౌకత్ అలీ, ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● **హుస్నాబాద్‌రూరల్/మద్దూరు:** హుస్నాబాద్ మండలంలోని మహ్మదాపూర్, పోతారం(ఎస్) రాములపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం జరిగిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో మండల విద్యాధికారి మనీల పాల్గొని మాట్లాడారు. తల్లితండ్రులు తమపిల్లలను స్థానిక సర్కారు బడులలో చేర్పించాలని సూచించారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించారు. మద్దూరు మండలంలోని గాగిళ్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో ఎంపీవో వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. పాఠశాలకు వచ్చే విద్యార్థుల ప్రగతిపై ఎప్పకప్పుడు తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే మద్దూరులో డ్రైడే నిర్వహించి పలు సూచనలు జారీ చేశారు.

సేంద్రియ సాగుతో అధికలాభాలు

కొండపాక, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కూరగాయలను సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చునని మండల ఉద్యాన శాఖ అధికారి కౌసల్య పేర్కొన్నారు. కొండపాక మండలం దుద్దెడ రైతు వేదికలో మంగళవారం ఉద్యాన పంటలపై రైతులకి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖ అధికారి కౌసల్య ఉద్యాన పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఉద్యాన పంటల సబ్సిడీ వివరాలు, ఆయిల్‌పామ్ పంట లాభాలను వివరించారు. కూరగాయల సాగుతో అధిక లాభాలు పొందవచ్చన్నారు. టమాటా, వంకాయ, మిర్చి నారు సబ్సిడీలో ఇస్తున్నారని,బీర , కాకర వంటి తీగ జాతి పంటలకి పందిరి సాగు సబ్సిడీ వివరాలు తెలిపారు. అదే విధంగా కొత్త పంటలైన డ్రాగన్ ఫ్రూట్, అవకాడో పంట సాగు, సబ్సిడీ ఆయిల్ పామ్ పంట లాభాలు, డ్రిప్ సబ్సిడీలను వివరించారు. కలెక్టరేట్ లోని ఉద్యాన శాఖ ఆఫీస్‌లో రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రనుష రైతులు ఉన్నారు.

● **రాయపోల్:** పామ్ ఆయిల్ తోటలు సాగు చేస్తే మంచి లాభాలు వస్తాయని గజ్వేల్ ఏడీఏ బాబూనాయక్ పేర్కొన్నారు మంగళవారం ఆయన ఏవో నరేష్‌తో కలిసి మండలంలో ఆయిల్‌పామ్ తోటను పరిశీలించారు. మంతూరు గ్రామంలో రైతు నాచగిరి మొదట మూడు ఎకరాల పామ్ ఆయిల్ తోటలు నాటి మంచి లాభాలు వస్తుండడంతో మరో నాలుగు ఎకరాలు నాటాడని తెలిపారు. అలాగే రైతులందరూ పామ్ ఫ్యాక్టరీ ఉన్నదని మార్కెట్‌కు సమస్య ఉండదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కవిత పాల్గొన్నారు.



రాయపోల్: మంతూరులో ఆయిల్ పామ్ తోటను పరిశీలిస్తున్న ఏడీఏ తదితరులు

కాంగ్రెస్, బీజేపీవి కుమ్మక్కు రాజకీయాలు: బీఆర్ఎస్

గజ్వేల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీజేపీ తెలంగాణ రాష్ట్రంలో కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ధ్వజమెత్తారు. గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రెండు ఒకటేనని తెలిపారు. ఇందులో భాగంగానే దుబ్బాక నియోజకవర్గంలోని చౌదర్‌పల్లిలో ప్రభుత్వ భూమిని పట్టా భూమిగా తన కుటుంబ సభ్యులపై మార్చుకున్నారని ఆరోపించారు. సోషల్ మీడియాలో రఘునందన్‌రావు భూమిని కబ్జా చేసిందని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్నా ఇప్పటివరకు ప్రెస్‌మీట్ పెట్టి వివరణ ఇవ్వకుండా రఘునందన్‌రావు మొహం చాటేశారన్నారు. అంతేకాకుండా కబ్జా ఆరోపణలను ఖండించకపోవడం కబ్జా చేసినట్లు కాదా అని ప్రశ్నించారు. ఒకవేళ పేదల భూమి కబ్జా పెడితే బహిరంగంగా ప్రజలందరికీ క్షమాపణ చెప్పి ఆ భూమిని వెంటనే పేద ప్రజలకు అందించాలని వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు.

సాంబారుతోనే సరి

(5వ పేజీ తరువాయి)

బిల్లుల విషయంలో త్వరితగతీన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నంగునూరు మండలం పాలమాకుల స్కూల్‌లో మిక్స్‌డ్ వెజిటేబుల్ కర్రీకి బదులుగా పచ్చిపులుసు, సొరకాయ

సమస్యలతో సతమతం..

బిల్లులు రాకపోవడం ఒక సమస్య అయితే చాలా పాఠశాలల్లో కిచెన్ షెడ్లు కరువయ్యాయి. అసలే వర్షాకాలం కావడంతో వంట చేసే సందర్భంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని నిర్వాహకులు వాపోతున్నారు. ఇక గ్యాస్ సిలిండర్లను ఏర్పాటు చేస్తామని చెబుతున్నప్పటికీ అందని ద్రాక్షలాగే మారిందని, కట్టెల పొయ్యిపైనే వంట చేస్తున్నామని.. ప్రస్తుత పరిస్థితుల్లో కట్టెల ధర ఎక్కువగా ఉందని ఆవేదన చెందుతున్నారు. వర్షానికి కట్టెలకు సరిగా నిప్పంటకపోవడంతో పాఠశాల అంతా పొగ కమ్ముకుంటున్నదని చెబుతున్నారు.

రూ. కోటిన్నర బకాయి..

జిల్లాలోని 918 ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతున్నది. ఈ పథకం ద్వారా 66,069 మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు. కాగా వీరికి వంట చేసి పెట్టడానికి 1933 మంది కార్మికులు, మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులు పనిచేస్తున్నారు. గత మార్చి నుంచి వీరికి బిల్లులు ఇవ్వడం లేదు. దీంతో బకాయి కాస్తా రూ.కోటిన్నరకు చేరింది.

గజ్వేల్ పోలీసు అధికారులకు రివార్డుల అందజేత



సీపీ ద్వారా రివార్డు అందుకుంటున్న గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ సైదా

గజ్వేల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మారెడ్డిపల్లి గ్రామ శివారులోని వ్యవసాయభూమిలో నల్ల సత్తవ్వ అనే వృద్ధురాలు హత్యకు గురైంది. ఈ కేసులో ఎలాంటి క్లూస్ లేకుండానే పోలీసులు ఛేదించి సీపీ చేతుల మీదుగా రివార్డు అందుకున్నారు. గజ్వేల్ ఇన్‌స్పెక్టర్లు సైదా, ముత్యంరాజు, క్రైమ్ వర్టికల్ ఐటీ సెల్ సిబ్బంది ఏఎస్ఐ యాదగిరి, కానిస్టేబుళ్లు నరేందర్, వెంకటేష్, రవి, దివ్య, శ్రీకాంత్, రమేష్, సురేందర్, హోంగార్డ్ నగేష్‌లు టెక్నాలజీ సహాయంతో నేరస్థుడిని చాకచక్యంగా పట్టుకున్నారు. వృద్ధురాలి హత్య కేసు ఛేదించి బంగారు ఆభరణాలు రికవరీ చేసినందుకు సీపీ బి.అనురాధ వారిని అభినందించారు. ఈ మేరకు మంగళవారం కమిషనర్ కార్యాలయంలో సదరు పోలీస్ అధికారులు, సిబ్బందికి నగదు రివార్డులు అందజేశారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

గజ్వేల్ రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 9,700 నగదు, 5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన గజ్వేల్ మండలంలో చోటు చేసుకున్నది. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ మండలం కోమటిబండ గ్రామశివారులో కొంతమంది పేకాట ఆడుతున్నారని పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, గజ్వేల్ పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.9,700 నగదు, 5మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గజ్వేల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మల్లన్న ఆలయ సిబ్బంది నిరసన

చేర్యాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : భద్రాచల సీతారామాంజనేయ ఆలయ ఈవో రమాదేవిపై పురుషోత్తమపట్నం గ్రామంలో పలువురు దాడులకు పాల్పడం తగదని పేర్కొంటూ కొమురవెల్లి మల్లన్న ఆలయ ఉద్యోగులు, అర్చకులు మంగళవారం ఆలయ ఆవరణలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు పడిగన్నగారి ఆంజనేయులు మాట్లాడుతూ ఆలయభూముల పరిరక్షణకు వెళ్లిన ఆలయ ఉద్యోగులు, సిబ్బందిపై దాడి చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. దుండగులను కఠినంగా శిక్షించి ఆలయ ఉద్యోగులు, సిబ్బందికి రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవో బుద్ది శ్రీనివాస్, సూపరింటెండెంట్‌లు శ్రీరాములు, సురేందర్‌రెడ్డి, ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్, మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సిద్దిపేట ట్రాఫిక్ ఎస్ఐ

సిద్దిపేట క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అక్కన్నపేట నుంచి బదిలీపై వచ్చిన ఎస్ఐ విజయబాస్కర్ సిద్దిపేట ట్రాఫిక్ ఎస్ఐగా మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మర్యాదపూర్వకంగా సీపీ డాక్టర్ బి. అనురాధను కలిసి పూల మొక్కను అందజేశారు.

జిల్లాలో ముమ్మరంగా వనమహోత్సవం



సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు



కోహెడ మండలం శనిగరంలో మొక్కలు నాటుతున్న ఎక్సైజ్ ఎస్ఐ దామోదర్ తదితరులు



సిద్దిపేట రూరల్: జక్కాపూర్ గ్రామంలో మొక్కలు నాటిన అధికారులు, స్థానిక సిబ్బంది

న్యూస్‌నెట్‌వర్క్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో మంగళవారం వనమహోత్సవ కార్యక్రమం ముమ్మరంగా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఖాళీ ప్రదేశాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో సంబంధిత అధికారులు పాల్గొని మొక్కలు నాటారు. సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ (జాతీయ సేవా పథకం) ఆధ్వర్యంలో ఘనంగా వనమహోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు. అధ్యాపకులు, విద్యార్థులు కళాశాల ఆవరణలో పండ్లు, పూల మొక్కలను నాటారు. సిద్దిపేట రూరల్ మండలం మాచాపూర్ గ్రామంలో ఎక్సైజ్ శాఖ సూపరిండెంట్ శ్రీనివాస మూర్తి నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామంలో జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డిలు వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈవో మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల భావితరాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. కొమురవెల్లి మండలంలోని అయినపూర్ గ్రామ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లితండ్రులు-ఉపాధ్యాయుల సమావేశం అనంతరం ఏంపీడీవో శ్రీనివాస వర్మ, ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లితండ్రులు పాఠశాల అవరణలో మొక్కలు నాటారు. గురువన్నపేటలో పంచాయతీ కార్యదర్శి చిలుక కరుణాకర్ ఉపాధిహామీ కూలీలతో కలిసి మొక్కలు నాటారు. దుబ్బాక మండలం రామక్కపేట పీహెచ్‌సీలో జిల్లా పౌరసరఫరాల శాఖ, మండల ప్రత్యేకాధికారి తనూజ మొక్కలను నాటారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణపనులు పరిశీలించారు. అలాగే జడ్పీహెచ్ఎస్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల్లో మొక్కలు నాటినట్టు మిరుదొడ్డి ఎంపీడీవో గణేష్‌రెడ్డి అన్నారు. మిరుదొడ్డి మండలంలోనిధర్మారం, కాసులాబాద్, మిరుదొడ్డి గ్రామాల్లో మొక్కలు నాటారు. అలాగే బీకేపీ కార్యాలయం వద్ద డీఆర్‌డీఏ ఏపీడీ ప్రకాష్ మొక్కను నాటారు. రాయపోల్‌లో జరిగిన వన మహోత్సవం కార్యక్రమంలో గజ్వేల్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్(ఏడీఏ) బాబూనాయక్ పాల్గొని అధికారులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. బెజ్జంకి మండలంలోని ఆయా గ్రామాల్లో మొక్కలు నాటినట్టు మండల స్పెషల్ ఆఫీసర్ మల్లేశం, ఎంపీడీవో ప్రవీణ్ తెలిపారు. మద్దూరు రైతువేదిక ఆవరణలో ఎంపీడీవో ఎస్. రాంమోహన్ స్థానిక కస్తూర్బా పాఠశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కోహెడ మండలంలోని శనిగరం గ్రామంలో ఎక్సైజ్ ఎస్ఐ దామోదర్, పంచాయతీ కార్యదర్శి చంద్రం గౌడ సంఘము సభ్యులతో కలిసి ఎర్రగుంటలో ఈత మొక్కలను నాటారు. గజ్వేల్ మండలంలోని అక్కారం గ్రామంలో స్పెషల్ ఆఫీసర్ సువర్ణ, ప్రజ్ఞాపూర్ బస్సు డిపో వద్ద సీహెచ్ బాలకృష్ణలు మొక్కలు నాటారు.

ఓటరు నమోదులో జాప్యం జరగొద్దు



బీఎల్‌వోల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్

దౌల్తాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): బీఎల్‌వోలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి ఓటరు నమోదులో జాప్యం జరగకుండా చూసుకోవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ గరీమా అగ్రవాల్ పేర్కొన్నారు. మంగళవారం దౌల్తాబాద్ రైతు వేదికలో జరిగిన బూత్‌స్థాయి బీఎల్‌వోల సమావేశానికి అదనపు కలెక్టర్ హాజరై ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. అనంతరం గోవిందాపూర్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అదే విధంగా అంగన్‌వాడీ చిన్నారులతో ముచ్చటించి పౌష్టికాహారంపై వివరాలను తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాజుకు పలు సూచనలు చేశారు. లింగారాజులపల్లి ఎంజేపీ బాలుర పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంటశాలలో కురగాయలు, బియ్యం పరిశుభ్రంగా లేకపోవడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంట మండల స్పెషల్ అధికారి లింగస్వామి, ఎంపీడీవో వెంటకలక్ష్మీమ్మ, తహసీల్దార్ చంద్రశేఖర్‌రావు, ఎంఈవో గజ్జెల కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

వరకవి సిద్దప్ప సాహిత్యాన్ని అధ్యయనం చేయాలి



సిద్దప్ప చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, సిద్దప్ప కుమారుడు

సిద్దిపేట కల్చరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజా కవి, తత్వవేత్త వరకవి సిద్ధప్ప జయంతి ఉత్సవాన్ని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా సిద్దప్ప కుమారుడు అనంతవరం మాణిక్య లింగం హాజరై సిద్ధప్ప తత్వాలను చదివి వినిపించారు. అనంతరం తెలుగుశాఖ అధ్యక్షుడు డా: మట్టా సంపత్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ సిద్దప్ప ప్రజా సాహిత్యాన్ని అధ్యయనం చేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సిద్ధప్ప శిష్యుడు సాహిత్య పోషకుడు కానుగుల మోహన్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ మధుసూదన్, తెలుగు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరా మహిళాశక్తి సంబరాలు



వర్గల్ మండల కేంద్రంలో నిర్వహించిన సంబరాల్లో సమాఖ్య సభ్యులు

వర్గల్/ములుగు/చేర్యాల/మద్దూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండల సమాఖ్యలో ఇందిరా మహిళాశక్తి సంబరాలు మంగళవారం మండల సమాఖ్య అధ్యక్షురాలు రేణుక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెర్ప్ ఐబి పీఏ భారతి హాజరై మాట్లాడుతూ.. గ్రామ సంఘాల పనితీరు బేష్‌గా ఉందని కితాబిచ్చారు. మహిళా సంఘ సభ్యులకు ప్రధానమంత్రి, మైక్రో, స్కీముల ద్వారా జీవనోపాధి కల్పించినట్టు ఏపీఎం ఆనంద్ కుమార్ తెలిపారు. ములుగులో నిర్వహించిన డ్వాక్రా ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో జిల్లా పీడీ జయదేవ్ పాల్గొని మాట్లాడుతూ.. డ్వాక్రా సంఘం మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. చేర్యాల పట్టణంలోని శ్రీనిధి మండల సమాఖ్య కార్యాలయంలో ఇందిరా మహిళాశక్తి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళాసంఘాల నిర్వహణలో నైపుణ్యం కనబరిచిన మహిళలను సత్కరించారు. మద్దూరులోని మండల జాగృతి సమాఖ్య కార్యాలయంలో గ్రామైఖ్య సంఘాల మహిళలు ఇందిరమ్మ మహిళా శక్తి సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు. కార్యాలయం ఎదుట ముగ్గులతో అందంగా తీర్చిదిద్దారు.


కేంద్రమంత్రి బండిసంజయ్‌ను కలిసిన బాధితులు

చేర్యాల, జూలై 8(ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలో కొనసాగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనుల కారణంగా చేపట్టిన ఇళ్లు, భవనాల కూల్చివేతను నిలిపివేయించాలని కోరుతూ మంగళవారం పలువురు బాధితులు బీజేపీ, సీపీఐ, వర్తక, వాణిజ్యసంఘం నాయకులతో కలిసి కేంద్రమంత్రి బండి సంజయ్‌కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి సంజయ్ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి పలు సూచనలు చేశారు. అనంతరం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కలెక్టరేట్ కార్యాలయ ఏవో రహమాన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బూరుగు సురేశ్, సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు అందె అశోక్, కిరాణవర్తక సంఘం అధ్యక్షుడు శేరి బాలనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చదివిన పాఠశాలలోనే ఇంటర్ సీటు కేటాయించాలి

కొండపాక/చేర్యాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలోని ఎస్సీ గురుకుల పాఠశాలల్లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు అదే పాఠశాలలో ఇంటర్ విద్య కొనసాగించేలా సీట్లు కేటాయించాలని తెలంగాణ రెసిడెన్షియల్ గురుకుల తల్లిదండ్రుల కమిటీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు జాలిగామ నర్సింగరావు కోరారు. ఈ మేరకు జోనల్ ఆఫీసర్ ప్రత్యూష, జిల్లా డీసీవో నరసింహాచారికి తల్లిదండ్రులతో కలిసి వినతి పత్రం అందజేసినట్టు ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల భద్రత, ఇతర ఇబ్బందుల దృష్ట్యా వారు పదవ తరగతి చదివిన పాఠశాలల్లోనే ఇంటర్ సీట్లు కేటాయించాలని కోరారు. అలాగే ఇప్పటికే బదిలీ కోరిన విద్యార్థులకు తక్షణమే కోరిన పాఠశాలలకు బదిలీ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల నర్సింలు, కమిటీ ప్రతినిధులు బుట్టి భిక్షపతి, బత్తుల దయాకర్, మహేందర్, బాబు, దొమ్మాట కనకయ్య, బోనగిరి దేవదానం. బోనగిరి సులోచన పాల్గొన్నారు.

పూల్ నాయక్ తండాలో సీత్లా భవాని వేడుకలు



సంప్రదాయ పూజలు నిర్వహిస్తున్న గిరిజన మహిళలు

హుస్నాబాద్ రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ మండలం పూల్ నాయక్ తండాలో మంగళవారం సాయంత్రం సీత్లా భవాని వేడుకలను గిరిజనులు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గిరిజన సంప్రదాయ పూజలు చేశారు. ఇందులో గిరిజన నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీస్తాం

మిరుదొడ్డి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి సైన్స్‌ఫెయిర్ ఎంతో ఉపయోగపడుతుందని మిరుదొడ్డి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అర్చనప్రియదర్శి పేర్కొన్నారు. మంగళవారం మిరుదొడ్డి మోడల్‌స్కూల్‌లో అగస్త్య ఇంటర్‌నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైన్స్‌ఫేర్‌ను నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించినట్టు తెలిపారు. దేశంలోని 23రాష్ట్రాల్లో అగస్త్య ఫౌండేషన్ సభ్యురాలు సరిత ఆధ్వర్యంలో సైన్స్‌పై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.